
ప్రజాశక్తి

శనివారం 18 ఫిబ్రవరి 2023 8 పేజీలు





తిరుపతి చిత్తూరు

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్‌కు...

22న వేలాదిగా తరలిరండి : సిఐటియు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) ఎమ్మెల్సీ అభ్యర్థులు మీగడ వెంకటేశ్వర రెడ్డి, పి. బాబురెడ్డిల నామినేషన్ కార్యక్రమానికి ఈనెల 22న చిత్తూరు నగరానికి వేలాదిగా తరలిరావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి పిలుపునిచ్చారు. నీతి, నిజాయితీకి, ఉద్యమ వారసత్వానికి ప్రతినిధులు వెంకటేశ్వరరెడ్డి, బాబు రెడ్డిలని పేర్కొన్నారు. అత్యంత సాధారణ ఉపాధ్యాయులను ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పిడిఎఫ్ ఎంపిక చేసిన నేపథ్యంలో సిఐటియు, ఏఐటియుసి, ఐఎన్‌టియుసి తదితర కార్మిక సంఘాలు మద్దతును ప్రకటించాయని గుర్తు చేశారు. రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం అడ్డగోలు చర్యలతో ఎమ్మెల్సీ పదవులను గెలుచుకోవాలన్న తపనతో ఉందని, విద్యాధికులు, ఉద్యోగులు మరోమారు పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించి చరిత్ర సష్టించాలని విజ్ఞప్తి చేశారు. చిత్తూరు నగరంలో 22వ తేదీ బుధవారం వేలాది మందితో కట్టమంచి నుంచి నాగయ్య కళాక్షేత్రానికి ప్రదర్శన నిర్వహిస్తామని, అనంతరం సభ జరుగుతుందని తెలిపారు. సిఐటియు అనుబంధ యూనియన్లు, నేతలు నామినేషన్ కార్యక్రమానికి తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

దళిత జడ్‌పిటిసికి అవమానం జరిగితే...

దళిత ఎంపి, ఎమ్మెల్యే, మంత్రి స్పందించరా..?

కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూటిప్రశ్న

ప్రజాశక్తి – గూడూరు

'దళిత జడ్‌పిటిసి కూర్చోవాల్సిన కుర్చీపై మూత్రం పోసి, కులం పేరుతో అవమానిస్తే కనీసం దళిత ప్రజాప్రతినిధులైన ఎంపి గురుమూర్తి, ఎంఎల్ఎ వరప్రసాద్‌రావు, డిప్యూటీ సిఎం నారాయణస్వామిలు స్పందించరా..?' అని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి ప్రశ్నించారు. బాధితున్ని పరామర్శించి, సమగ్ర విచారణ జరిపి, ముద్దాయిలపై కేసు నమోదుచేసి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరడానికి ఏం అభ్యంతరమని




మండిపడ్డారు. కులదురంహంకారానికి కారణమైన ప్రవీణ్‌రెడ్డి, వాలంటీర్లు కాటయ్య, హనుమంతులపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితుడు మన్నెం శీనయ్యను గూడూరు నాయకులు ఎ.ప్రసాద్, సురేష్, శివయ్య, ముత్యాలుతో కలిసి పరామర్శించారు. గూడూరులోని కార్యాలయంలో బాధితుడు శీనయ్యతో కలిసి విలేకరుల సమావేశంలో ఆంధ్రమాల్యాద్రి మాట్లాడుతూ ఘటన 12వ తేదీ జరిగితే 13న స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇంతవరకూ కేసు నమోదు చేయకపోవడం దుర్మార్గమన్నారు. శీనయ్యకు మూడేళ్లుగా కార్యాలయంలో కూర్చునేందుకు కుర్చీ వేయలేదని, ఎంఎల్ఎ సహకారంతో కుర్చీ వేయిచుకుంటే ఆగ్రహించిన ప్రవీణ్‌రెడ్డి ఈ దురాగతానికి పాల్పడ్డారని మండిపడ్డారు. సామాజిక 5 లో

ముక్కంటికి ప్రభుత్వ పట్టు వస్త్రాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం తరపున ముక్కంటికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పెద్దిరెడ్డి పట్టు వస్త్రాలతో కుటుంబ సమేతంగా ఆలయానికి రాగా స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో సాగర్ బాబు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలను స్వామీ అమ్మవార్లకు సమర్పించారు.



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంఎల్ఎ బియ్యపు

(తరువాయి భాగం)

దళిత ఎంపి, ఎమ్మెల్యే, మంత్రి స్పందించరా..?

న్యాయం గురించి చిలకపలకలు పలికే ముఖ్యమంత్రి ఈ దురాగతంపై స్పందించాలని డిమాండ్ చేశారు. తిరుపతి కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే దళిత గిరిజన ప్రజాసంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామన్నారు.



ఎస్ఐ ఉద్యోగాల ప్రాథమిక పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఈనెల 19వ తేదీ ఆదివారం ఎపిఎస్ఎల్‌పిఆర్‌బి ఎస్ఐ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్‌పి పి.పరమేశ్వరరెడ్డి వెల్లడించారు. పరీక్షా కేంద్రాలను అధికారులతో కలిసి ఎస్వీ పాలిటెక్నిక్, ఎస్‌జిఎస్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. స్ట్రాంగ్ రూమ్ పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు సిబ్బందితో పటిష్టమైన బందోబస్తుతో పాటు, సిసి కెమెరాలను ఏర్పాటు చేసి, కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. తిరుపతి నగరం నందు మొత్తం 21 పరీక్షా కేంద్రాలలో 12,799 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. అభ్యర్థులు ఖచ్చితంగా ప్రభుత్వం ఇచ్చిన ఏదైనా ఒక ఒరిజినల్ గుర్తింపు కార్డును, హాల్ టికెట్ ను, బ్లూ/బ్లాక్ బాల్ పెన్నును మాత్రమే పరీక్షా గదిలోకి అనుమతించడం జరుగుతుంది. ఒరిజినల్ గుర్తింపు కార్డు యొక్క సాఫ్ట్ కాపీ ను మొబైల్ నందు చూపిస్తే అనుమతి ఖచ్చితంగా ఉండదని. అభ్యర్థులు అందరూ ఈ విషయాన్నీ గమనించి తగు జాగ్రత్తలు పాటించి హాజరవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి వెంకటరావు అడ్మిన్, సెబ్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర, డిఎస్పి లు సురేంద్ర రెడ్డి ఎస్బి, నరసప్ప వెస్ట్, మురళీకష్ణ ఈస్ట్ పాల్గొన్నారు.

టిడిపి నుంచి షణ్ముగాన్ని తొలగింపు

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

తెలుగుదేశం బీసి విభాగంలో సుదీర్ఘకాలం పని చేయడంతో పాటు చిత్తూరు టౌన్ బ్యాంకు ఛైర్మెన్‌గా పని చేసిన షణ్ముగాన్ని పార్టీ నుండీ తొలగించడంతో పాటు కస్టర్లను రద్దు చేస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చం నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. షణ్ముగంపై టౌన్ బ్యాకు ఛైర్మెన్‌గా ఉన్న కాలంలో కోటి రూపాయల మేర అక్రమాలకు పాల్పడిన్నట్లు అరోపణలున్నాయి. ఈ మేరకు కేసు విచారణ జరుగుతోంది. టౌన్ బ్యాంకు గిల్టు నగల తాకట్టు కేసులో ఏవన్ ముద్దాయిగా షణ్మగం ఉన్నారు. ఇటీవల యువగళం పాదయాత్ర సందర్భంగా సంతపేటలో పార్టీ నిబంధనలకు విరుద్ధంగా షణ్మగం ప్రవర్తించారని జిల్లా టిడిపి ముఖ్య నేతలు నారా లోకేష్ దృష్టికి తీసుకుపోయారు. షణ్ముగం పార్టీలో కొనసాగితే పార్టీకి నష్టమని రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకుపోయారు. ఈ మేరకు చిత్తూరు నియోజకవర్గ కస్టర్ యూనిట్ కమిటీలను రద్దు చేయడంతో పాటు బీసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి, పార్టీ నుండీ తొలగిస్తున్నట్లు ప్రకటించారు. 'షణ్ముగం' అవినీతి అక్రమాలకు సంబంధించి 'ప్రజాశక్తి'లో అప్పట్లో వరుస కథనాలు ఇవ్వడం గమనార్హం.

బియ్యపు మధుసూదన్ 'బడాచోర్'

యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ధ్వజం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి/తొట్టంబేడు (తిరుపతి జిల్లా)

'శ్రీకాళహస్తి ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డి బడాచోర్.. ఈ మూడేళ్లలోనే రెండువేల కోట్లు వెనకేసుకున్నారు... ఎమ్మెల్యే, ఎమ్మెల్యే కుమార్తె, కుమారుడు, బంధువులు శ్రీకాళహస్తిని కేక్ లా కట్ చేసి వాటాలు పంచుకుంటున్నారు' అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే శ్రీకాళహస్తిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. తాగు, సాగు నీటి ప్రాజెక్టులన్నింటినీ వందశాతం పూర్తి చేసి శ్రీకాళహస్తి ప్రజల కష్టాలు తీరుస్తామని హామీ ఇచ్చారు. తన పాదయాత్రను శ్రీకాళహస్తిలో ఉత్సవాల పేరుతో స్థానిక ఎమ్మెల్యే పోలీసుల సాయంతో అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాడనీ, అక్రమ కేసులకు జడిసేది లేదని స్పష్టం చేశారు. అక్రమ కేసులు పెట్టిన పోలీసులకు చుక్కలు చూపిస్తామని హెచ్చరించారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర శుక్రవారం సత్యవేడు నియోజకవర్గం దాటి శ్రీకాళహస్తి నియోజకవర్గంలోకి అడుగుపెట్టింది. ఉదయం తొట్టంబేడు మండలం లక్ష్మీపురం నుంచి మొదలైన పాదయాత్ర మధ్యాహ్నం 12 గంటలకు



రామచంద్రాపురానికి చేరింది. ఈ క్రమంలో లోకేష్ శ్రీకాళహస్తి-పిచ్చాటూరు ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న గ్రామాలను సందర్శిస్తూ ప్రజలను పలకరిస్తూ యాత్ర సాగించారు. తదనంతరం రామచంద్రపురంలో నిర్వహించిన రైతు బహిరంగ సభనుద్దేశించి ప్రసంగించారు. జగన్ రెడ్డి పాలనలో ఉద్యోగం, ఉపాధి, సంక్షేమం అటకెక్కిందని విమర్శించారు. టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి, మాజీ మంత్రి అమర్నాథ్, చక్రాల ఉషా, గాలి చలపతి నాయుడు, విజయ్ కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే పూర్తయిన భూముల్లో హద్దురాళ్లు నాటాలి : జేసీ

తిరుపతి టౌన్ : జిల్లాలో రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో హద్దు రాళ్ళను నాటడం పూర్తిచేయాలని, ఇప్పటికే ఇంటి పట్టాలు అందించిన వారి వివరాలు ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయాలని జెసి డి.కె.బాలాజీ సూచించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాలోని ఆర్డిఒ లతో , తహశీల్దార్లతో , సర్వేయర్లతో జెసి, డి ఆర్ ఓ సమావేశమై పలు అంశాలపై చర్చించారు. జెసి మాట్లాడుతూ ఎన్నికల విధులు కేటాయించిన సర్వేయర్లు సూచించిన మేరకు హాజరు కావలసి ఉంటుందని, రీ సర్వే పనులను అనుకున్న సమయం మేరకు పూర్తి చేయాల్సి ఉంటుందని అన్నారు. అసైన్డ్ భూముల జాబితా సిద్ధంచేయాలని, మ్యుటేషన్లకు సంబందించి వారసులు ఒకరు వున్నచోట తక్షణమే పూర్తిచేయాలని అన్నారు. రీసర్వే సమయంలో ఖాతాలో చిన్న తప్పులు కూడా లేకుండా చూడాలని అన్నారు. నాయుడుపేట జాతీయ రహదారి సంబంధించి భూసేకరణ త్రి-డి పూర్తి కావాలని సూచించారు. డి ఆర్ ఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎం.ఎల్.సి.ఎన్నికలకు సంబంధించి కోర్టు ఉత్తర్వులు మేరకు ప్రవేటు పాఠశాల ఉపాధ్యాయులు డి ఇ ఓ కౌంటర్ సంతంకం లేనివి ఓటరుగా ఆమోదించ రాదని అన్నారు. చిన్న పొరపాటుకు తావులేకుండా క్లైముల పరిశీలన వుండాలని అన్నారు. ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు సిబ్బంది సూచించిన తేదీల్లో శిక్షణకు, విధులకు హాజరు కావాలని అన్నారు. ఈ సమీక్షలో ఆర్డిఓ లు కనకనరసా రెడ్డి, కిరణ్ కుమార్ , చంద్ర ముని, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ కోదండరామి రెడ్డి, ఎ డి సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ జయరాజ్ పాల్గొన్నారు

మేయర్ దంపతుల హత్యకేసు విచారణ

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

జిల్లా కేంద్రమైన చిత్తూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో 2015, నవంబర్ 17వ తేది జరిగిన నగర మేయర్ కఠారి అనురాధ, కఠారి మోహన్ దంపతుల హత్య కేసు అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. ఈ కేసులో 22 మందిని ముద్దాయిలుగా గుర్తించి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసునమోదు చేశారు. 'ఏ'వన్ ముద్దాయిగా చింటూ అలియాస్ చంద్రశేఖర్ నాటకీయ పరిణామాల మధ్య జిల్లా కోర్టులో లొంగిపోయిన విషయం విదితమే. నాటి నుండీ ఈ కేసులోని 21 ముద్దాయిలకు కోర్టు బెయిల్ మంజూరు చేయగా 'ఏ' వన్ ముద్దాయి చింటూ చిత్తూరు జిల్లా కోర్టులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. నగర మేయర్ జంట హత్యల కేసు శుక్రవారం విచారణకు వచ్చింది. ఏ వన్ ముద్దాయి చింటూతో సహా ఈ కేసులోని 22 మంది ముద్దాయిలను, సాక్ష్యులను ఆరవ అదనపు జడ్జి శాంతి ఎదుట హాజరుపరచారు. నాలుగో



అదనపు కోర్టులో శుక్రవారం సాక్ష్యులను విచారించారు. సంఘటన స్థలంలో ప్రధాన సాక్షి సతీష్‌ను కోర్టు శుక్రవారం ఉదయం నుండీ సాయంత్రం వరకు విచారించింది. పాత జిల్లా కోర్టుకు ఏవన్ ముద్దాయి చింటూను పోలీసు భద్రత నడుమ కోర్టుకు తీసుకొచ్చారు. కోర్టు ఎదుట భారీ పోలిస్ భద్రత ఏర్పాటు చేశారు. కేసు విచారణ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు.

'మోహన్ డిస్టిలరీ' కార్మికుల సమ్మె

ఆగిన మద్యం ప్యాకింగ్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

కార్మికుల కడుపు కొట్టి యజమాన్యం పబ్బం గడుపుకుంటుందని మోహన్ డిస్టిలరీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. గుడిపాల మండలంలోని మోహన్ డిస్టిలరీ కార్మికులు శుక్రవారం సమ్మె బాట పట్టారు. సుమారు 400 మంది కార్మికులు ఫ్యాక్టరీ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కార్మికులు విధులకు హాజరు కాకపోవడంతో ఫ్యాక్టరీలో మద్యం ప్యాకింగ్ నిలిచిపోయింది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తాము 20 ఏళ్లుగా పని చేస్తున్నా కనీస వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. కార్మికులకు కనీస సౌకర్యాలు, మరుగుదొడ్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగితే పట్టించుకోవడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే కార్మికులకు బస్సు చార్జీల రూపంలో సంపాదనలో సగభాగం ఖర్చయిపోతుందన్నారు. ఫిర్యాదు చేసిన కార్మికుల పట్ల వేధింపులకు పాల్పడుతూ విధుల నుంచి తొలగిస్తున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనంగా రోజుకు రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారులు స్పందించి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల పక్షాన నిలబడిన తనను ఎంపీపీ ప్రసాద్ రెడ్డి బెదిరిస్తున్నారని మానవ హక్కుల సంఘం నేత కష్ణమూర్తి రెడ్డి తెలిపారు. తనకు ఎలాంటి హాని జరిగినా ఎంపీపీ బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. కార్మికుల హక్కులు సాధించేంతవరకు పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా లేబర్ కాంట్రాక్టర్ తో కార్మికులకు వాగ్వాదం జరిగింది. కార్మికులకు సిపిఐ ఎం నేత దాసరి చంద్ర సంఘీభావం ప్రకటించారు.



శ్రీసిటీని సందర్శించిన రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి

ప్రజాశక్తి - సత్యవేడు రూరల్

రాష్ట్ర ప్రభుత్వ చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ సతీష్ కామత్ (ఆపరేషన్స్) ఆమెకు సాదర స్వాగతం పలికి, పారిశ్రామిక ప్రగతి, ఉపాధి అవకాశాలు, పెట్టుబడుల అనుకూల వాతావరణంతో పాటు ఇక్కడ ఏర్పాటైన వస్త్ర పరిశ్రమలు గురించి వివరించారు. శ్రీసిటీ మౌళిక సదుపాయాలు, పారిశ్రామిక అభివద్ధి పట్ల సంతప్తి వ్యక్తం చేసిన సునీత, ముఖ్యంగా సురక్షితమైన వాతావరణంలో మహిళలకు పెద్దఎత్తున ఉపాధి కల్పిస్తున్న తీరును ప్రశంసించారు. పర్యటనలో భాగంగా శ్రీసిటీ పరిసరాలతో పాటు జెన్ లెనిన్, ఎం ఎస్ ఆర్ గార్మెంట్స్ పరిశ్రమలను ఆమె సందర్శించారు. ఆయా పరిశ్రమలలో తయారవుతున్న వస్త్ర ఉత్పత్తులతో పాటు కార్మికుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

26న మొదలియార్ల 'స్వయంవరం'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

ఈ నెల 26న తిరుపతి గాంధీ భవన్ వేదికగా తిరుపతి మొదలియార్ల సంఘం ఆధ్వర్యంలో స్వయంవరం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి టి. వెంకటరమణ తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా ఈ స్వయంవరం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కరోనాకు ముందు నిర్వహించిన స్వయంవరం ద్వారా 47 జంటలకు వివాహం జరిగిందన్నారు. ఈ స్వయంవరం కార్యక్రమంలో పాల్గొనే వారు ముందుగా 900 రూపాయలను కట్టి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. స్వయంవరంకు వచ్చే వారికి భోజనాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బోజరాజు, శశిరేఖ, రవి పాల్గొన్నారు.

నారా లోకేష్ పాదయాత్రను నిలిపేయాలి

తిరుపతి టౌన్ : మార్చి నెలలో జరగబోవు ఉపాధ్యాయుల, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల కోడ్ ఈ నెల 9వ తేది నుండి అమలవుతున్న నేపథ్యంలో యువగళం పేరిట తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న పాదయాత్రను నిలుపుదల చేయాలని కోరుతూ శుక్ర వారం ఉదయం తిరుపతి కలెక్టర్ కార్యాలయం లో కలెక్టర్ వెంకటరమణ రెడ్డికి వైఎస్ఆర్‌టియుసీ అధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సంధర్భంగా వై ఎస్ ఆర్ టి యు సీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ రాజా రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన తిరుపతి జిల్లాలోకి రానున్నారని, పాదయాత్రలో భాగంగా ఆ పార్టీకి సంబంధించిన పథకాలు, ప్రచారం, కరపత్రాలు పంచడం జరుగుతుందన్నారు. రాజకీయ ఉపన్యాసం చేయడం వల్ల ఎన్నికల కోడ్‌ని ఉల్లంఘించే అవకాశం ఉందని తెలిపారు, ఈ మధ్యనే నగరిలో మంత్రి అర్ కే రోజా ఇంటి వద్ద టీ డీ పీ మహిళా విభాగం పేరుతో రాజకీయం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ముహమ్మద్ రఫీ, నగర కార్యదర్శి శ్రీమంతుల రామయ్య పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వైసిపి నేతలు

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని.. తల్లిదండ్రులు సైతం ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంట్లో పిల్లలను చదివించాలని.. నలభై రోజులపాటు ఇంట్లో టీవీలను చూపకుండా చూడాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేదురుమల్లి సుజాతమ్మకు నివాళులు

ప్రజాశక్తి-కోట: ఆంధ్ర రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డ్ ఛైర్మన్, తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షుడు వెంకటగిరి నియోజవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం పంచాయతీలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయుకులు నేదురుమల్లి. హరిప్రసాద్‌రెడ్డి తల్లి సుజాతమ్మ శుక్రవారం మరణించారు. తెలుసుకున్న నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి వారి పార్థీవదేహానికి పూలమాలవేసి నివాళులర్పించినారు. నాయకులు నేదురుమల్లి హరీష్‌చంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

బాలల హక్కులు ప్రతిఒక్కరూ కాపాడాలి

ప్రజాశక్తి-రేణిగుంట: మండలలోని గుత్తివారిపల్లి పంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని మానవ హక్కులు సామాజిక అభివద్ధి విభాగం, ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహాల పై శుక్రవారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మర్దాల రవిబాబు మాట్లాడుతూ బాల్యం బడిలోనే ఉండాలని ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఉచిత నిర్బంధ విద్యను అందిస్తోందని.. అందరూ చదువుకుని ప్రగతిపథంలో నడవాలని, బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు నిండకుండా వివాహాలు జరిపించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. తల్లిదండ్రులు బలవంతంగా బాల్యవివాహాలు చేయాలని



చూస్తే చైల్డ్ లైన్ నెంబర్ 1098, పోలీసు వారి 100 కి కాల్ చేసి రక్షణ పొందవచ్చని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు ఇందిరాంబ, డాక్టర్ కోదండరామిరెడ్డి, డాక్టర్ పార్థసారథి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: కుక్కంబాకం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రజాప్రగతి ట్రస్టు ప్రధానోపాధ్యాయులు కోదండరావ్ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు కోఆర్డినేటర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణం కలుషితం అవుతోందన్నారు. మొక్కలు నాటడంతో మానవ మనుగడకు ఆక్సిజన్ అందుతుందన్నారు. పర్యావరణంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సోమల: సోమల తహశీల్దార్ కార్యాలయ సమీపంలో బుధవారం సాయంత్రం సోమల నుండి స్వగ్రామమైన భారతంమిట్టకు నడిచి వెళుతున్న బత్తల శ్రీరాములు(65) అనే వ్యక్తిని వెనక వైపు నుండి ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు పాలై తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీరాములును ఆసుపత్రిలో చూసేందుకు వచ్చిన అతని అత్త (శ్రీరాములు భార్యకు తల్లి) లక్ష్మమ్మ(82) గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అల్లుడిని చూడగానే అక్కడికక్కడే గుండెపోటుతో మరణించిన సంగతి తెలిసిందే. ఆమె అంత్యక్రియలను శుక్రవారం సదుం మండలం నడిగడ్డ గ్రామంలో నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం గాయపడ్డ అల్లుడు శ్రీరాములు మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.



చోరీ కేసులో ఒకరి అరెస్టు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల బస్టాండ్ సమీపంలో ఈ నెల 6వ తేదీ వ్యక్తికి మద్యం తాపించి అతని వద్దనున్న బంగారు చైను, ఉంగరం, సెల్ ఫోను చోరీ చేసిన కేసులో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా శుక్రవారం ఎస్ నడింపల్లి పంచాయతీ సూరయ్య గారి పల్లి బస్‌స్టాప్ వద్ద ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించగా వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తే చోరీ చేసింది తామేనని ఒప్పుకున్నారు. వీరిలో ఒకరు తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలానికి చెందిన అన్నామలై అను వ్యక్తి కాగా మరొకరు మైనర్ బాలుడు కావడంతో అతనిని వారి తల్లిదండ్రులకు అప్పగించి అన్నామలైను అరెస్టు చేశారు. అనంతరం అతన్ని పుంగనూరు కోర్టుకు రిమాండ్ నిమిత్తం తరలించినట్టు సోమల ఇన్‌ఛార్జి ఎస్సై మారుతి తెలిపారు.

కారు బోల్తా పడి ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-బాలాయపల్లి: వెంకటగిరి-గూడూరు రోడ్డు మార్గంలోని మన్నూరు మిట్ట సమీపంలో శుక్రవారం కారు బోల్తా పడింది. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

టీడీపీ హయాంలోనే గూడూరు అభివృద్ధి



ప్రజాశక్తి-గూడూరు: టీడీపీ హయాంలోనే గూడూరు అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన గూడూరులో విలేకర్లతో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే వైసీపీలోనే అభివృద్ధి జరిగిందని చెప్పడం విడ్డూరంగా ఉందని.. ఏ పార్టీ హయాంలో గూడూరు పట్టణం అభివద్ధి చెందిందో ఇక్కడి ప్రజలకు తెలుసన్నారు. కూరగాయల మార్కెట్, టవర్ క్లాక్, టీటీడీ కల్యాణ మండపం నిర్మిస్తున్నానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో గూడూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు పులిమి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య , తాతపూడి ఇశ్రాయేల్ కుమార్ , వాటంబేటి శివకుమార్, గూడూరు నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్ రహీం, చిల్లకూరు పార్టీ మండల అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వరరెడ్డి, నటశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

In The Court of The 6th Addl. District Cum Family Judge : Nellore

F.C.O.P.No. 333 / 2022

Chinigipalli Meena @ Vangapati Meena - Petitioner

Vs

Chinigipalli Janardhan - Respondent

Notice

To,
Chinigipalli Janardhan,
S/o Late **Chalamaiah,** R/o S.T. Colony, Sai Nagar, Bhairagi Patanam, Tirupathi Town, Chittoor District.

పై నెంబరున పిటిషనరు మీ నుండి విడాకులు కోరుతూ పై తెలిపిన కోర్టులో మీపై పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే01-03-2023**దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఈదూరు భాస్కరయ్య, ఎం.కాం., బి.ఎల్.,
పిటిషనరు తరపు అడ్వకేట్, నెల్లూరు.
సెల్: **94402 02889**

ఉపాధి అవకాశాలపై అవగాహన

ప్రజాశక్తి-క్యాంపస్: మలేషియన్ విశ్వవిద్యాలయాలలో విద్యా వ్యవస్థ, ఉపాధి అవకాశాల' పై అవగాహన కార్యక్రమాన్ని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని సావేరి అతిథి గహంలో శుక్రవారం నిర్వహించారు. ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ, ఎస్పీయంవీవీ మలేషియా విశ్వవిద్యాలయాలలో ఫార్మసీ విద్యపై ఆహ్వానిత ప్రసంగాన్ని నిర్వహించింది. మలేషియాలోని ఎంహెచ్ ఎస్ ఎ విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. మధుకాత్యాయని మలేషియా విశ్వవిద్యాలయాలలో విద్యా విధానం, ఫార్మసీ రంగంలో అవకాశాల గురించి చర్చించారు. కార్యక్రమంలో యూజీ చివరి సంవత్సరం, పీజీ విద్యార్థులందరూ పాల్గొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-క్యాంపస్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాయంలోని బయోటెక్నాలజీ విభాగం నిర్వహించతలపెట్టిన రెండురోజుల జాతీయ సదస్సు బ్రోచర్‌ను ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డి ఆవిష్కరించారు. 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ లైఫ్ సైన్సెస్ అండ్ బయోటెక్నాలజీ' అనే అంశంపై ఫిబ్రవరి 27, 28వ తేదీల్లో ఎస్వీయూలో జరిగే జాతీయ సదస్సు బయోటెక్నాలజీ ఆచార్యులు డా. కెవి. సరిత ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని, పరిశోధకులు పాల్గొని నూతన ఆవిష్కరణలు వివరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్, ప్రిన్సిపల్ ఆచార్య శ్రీనివాసులు రెడ్డి, బీవోఎస్ సభ్యులు ఆచార్య విజయ, డా.సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-క్యాంపస్: రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్ (ఆర్ఐఎంసీ-డెహ్రాడూన్)లో 2023-2024 విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతిలో ప్రవేశానికై జాతీయ స్థాయిలో జూన్ 3న పవేశ పరీక్ష నిర్వాహించనున్నట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యాసంస్థల అధినేత డా.ఎన్.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ పరీక్షకు 2011 జనవరి 2వ తేదీ నుంచి 2012 జూలై ఒకటో తేదీ మధ్యన జన్మించిన విద్యార్థులు అర్హులన్నారు. వివరాలకు 9399976999 , 8688888802 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

ఆకట్టుకున్న వాయిద్య విన్యాసం

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీకపిలేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద శుక్రవారం నిర్వహించిన సంగీతం, నత్య కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎస్వీ సంగీత, నత్య కళాశాల, నాదస్వరం పాఠశాల, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ కార్యక్రమాలు జరిగాయి. హరికథ పారాయణం జరిగింది. ఎస్వీ నాదస్వర పాఠశాల ఉపాధ్యాయులు రవిప్రభ బందం నాదస్వరం, చంద్రశేఖర్ బందం డోలు వాయిద్యాలతో మంగళధ్వని వినిపించారు. మంద అనంతకష్ణ-వేణువు, డా.కె.వి.కష్ణ వయోలిన్, యం. సుధాకర్ మదంగం, జి. నటరాజ ప్యాడ్స్, తబలపై వాయిద్య కచేరి నిర్వహించారు. ఇందులో లింగాష్టకం, గంగాదీశ్వరం, రారా వేణుగోపబాల, ఏమి సేతుర లింగ, మహాప్రాణ దీపం, తందనానా అహి, జయ జనార్ధన, మగుడి (నాగస్వరం) తదితర కీర్తనలను వాయిద్యాలపై పలికించారు. కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎస్.ఉషారాణి నత్య పర్యవేక్షణలో విద్యార్థినులు చక్కగా భరతనాట్యాన్ని ప్రదర్శించారు. ఇందులో తాండవ నత్యకారి.., కాంచ దళయతాక్షి... అర్ధనారీశ్వర..., శివపాదం, లింగాష్టకం, శివ భజన, కావడి, తందనాన అహి, మోహిని భస్మాసుర కూచిపూడి యక్షగానం తదితర కీర్తనలకు చక్కగా నత్యం చేశారు.

బాలికా బడి కలేనా..!



● నిర్వహణకు వసతులు పుష్కలం ● పిచ్చాటూరు ఉన్నత పాఠశాలలో సగానికిపైగా అమ్మాయిలే
● ప్రభుత్వం స్పందించాలని విద్యార్థినుల వేడుకోలు

ప్రజాశక్తి-పిచ్చాటూరు : పిచ్చాటూరు జడ్పీ పరిషత్తు ఉన్నత పాఠశాలకు సువిశాలమైన 9 ఎకరాల15 సెంట్ల స్థలం ఉండటంతో పాటు వసతులు సైతం అందుబాటులో ఉన్నాయి. తిరుపతి-చెన్నై జాతీయ రహదారికి ఆనుకొనే పాఠశాల అందరికీ సౌకర్యవంతంగా ఉండటంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు ఇక్కడ చదువుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. పిచ్చాటూరులో నీరువాయి, పిచ్చాటూరు, అప్పంబట్టు, ముడియూరు, వేలూరు, కీళపూడి, నింద్ర మండలంలోని కొప్పేడు, శ్రీరామాపురం, కావనూరు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. వీరితోపాటు ఇక్కడ పాఠశాలకు అనువుగా విద్యార్థులకు వేర్వేరుగా బాలుర, బాలికల వసతి గృహాలు సైతం పాఠశాలకు సమీపంలో సౌకర్యవంతంగా ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు సైతం ఇక్కడ పాఠశాలలో చదువుకుంటున్నారు. అరణియార్ ప్రాజెక్టు నిండా నీళ్లుపుష్కలంగా ఉంటూ చల్లని గాలితో కూడిన వాతావరణం ఇక్కడ పాఠశాల విద్యార్థులకు ఎంతో ఉత్సాహాన్ని నింపుతోంది. 1976 లో ప్రారంభించిన ఈ పాఠశాలకు ఎంతోమ ప్రాముఖ్యత ఉన్నా.. 47 సంవత్సరాలుగా బాలికల పాఠశాల ఏర్పాటు కలగానే మిగిలింది. ఇప్పటివరకు గత ప్రభుత్వాల నుంచి బాలికలకు ప్రత్యేకంగా పాఠశాలను ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు చెబుతున్నా ఇంకనూ కార్యరూపం దాల్చలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడు-నేడు కార్యక్రమంతో విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన తరగతి గదులు ఏర్పడ్డాయి. ప్రహరీతోపాటు ఆధునిక వసతులతో కూడిన మరుగుదొడ్లు, నీటి వసతి కల్పిస్తున్నారు. ఈ పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థులకు పైగా విద్యనభ్యసిస్నున్నా .. ఇందులో సగానికి పైగా బాలికలే ఉండటం గమనార్హం. పాఠశాలను ఈ ఏడాది అప్‌గ్రేడ్ చేసి ఇంటర్ విద్యను సైతం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో భాగంగా మొదటి ఏడాది కావడంతో ఇంటర్ మొదటి సంవత్సరంలో కేవలం అమ్మాయిలు మాత్రమే ఉంటున్నారు. బాలికల విద్యను ఇక్కడ సౌకర్యవంతంగా ఉండటంతో తల్లిదండ్రుల్లోనూ మంచి ఆసక్తి ఉంది. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విభాగాల్లో 240 సీట్లు మంజూరయ్యాయి. అయితే అన్ని వసతులు ఉన్నా బాలికలకు ప్రత్యేకంగా మారుస్తామని చెబుతున్న ప్రభుత్వాలు ఇప్పటికీ కలగానే మిగిలిపోతోంది. ఇప్పటికైనా ఎమ్మెల్యేతోపాటు అధికారులు స్పందించి పిచ్చాటూరులో ప్రత్యేకంగా బాలికల పాఠశాలను ఏర్పాటు చేయాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తప్పని పందుల బెడద



పాఠశాలలో ఉపాధ్యాయులు బాగా విద్యను అందిస్తున్నారు. పాఠశాలను అప్‌గ్రేడ్ చేసినప్పటికీ మాకు బాలికల పాఠశాలగా ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. పాఠశాలలో చాలా విశాలంగా ఉండటంతో ఆవరణలో అధికంగా పందులు తిరుగుతున్నాయి. పూర్తిస్థాయిలో ప్రహరీ నిర్మాణం చేయలేదు. ప్రహరీ నిర్మాణం వెంటనే పూర్తిం చేయించి విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకారం అందించాలి.

- జయశ్రీ, ఎంపీసీ, ఇంటర్ మొదటి సంవత్సరం

బాలికల పాఠశాలగా మార్చాలి



నేను ఆరో తరగతి నుంచి ఇక్కడే చదువుకొని పదో తరగతిలో పాసయ్యాను. ఉన్నత పాఠశాలలో ఎక్కువగా బాలికలే చదువుకుంటున్నారు. పాఠశాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానంతో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఇదే ఆవరణలో చదువుకునే అవకాశం కల్పించింది. అయితే పక్కనే కోఎడ్యుకేషన్ కాలేజీ ఉండటంతో ఇబ్బందులకు పడుతున్నాం. ప్రత్యేక బాలికల పాఠశాలగా మారిస్తే విద్యార్థినులకు మంచి భరోసా ఉంటుంది.

- దేవిశ్రీ, బైపీసీ, ఇంటర్ మొదటి సంవత్సరం

మౌలిక వసతులు కల్పించాలి



ఈ పాఠశాలలో అబ్బాయిలతో పాటు నేను కలిసి చదువుకుంటున్నాను. ఎక్కువగా బాలికలే చదువుతున్నారు. బాలికలకు మౌలిక వసతులు కల్పించాలి. బాలికలకు కావాల్సిన ప్రత్యేక శిక్షణతో ప్రాక్టికల్స్, కంప్యూటర్, లైబ్రరీలు ఏర్పాటు చేయాలి.

- మేఘల, 9వ తరగతి, పిచ్చాటూరు

డిజిటల్ తరగతి గదులు అవసరం



నాడు-నేడు ప్రోగ్రాంతో జిల్లా ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న మాలాంటి పేద విద్యార్థులకు సులువైన రీతిలో అర్థం చేసుకునే విధంగా డిజిటల్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి. చదువుకునే అవకాశం కల్పించి అమ్మాయిల కోసం ప్రత్యేక పాఠశాలగా ప్రభుత్వం గుర్తించి ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలి.

- సహ్యత, 9వ తరగతి, పిచ్చాటూరు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



జనవరిలో పాఠశాల తనిఖీకి విచ్చేసిన జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ శేఖర్‌కు పాఠశాల సమస్యలపై విన్నవించాం. చదువుతున్న బాలికల కోరిక మేరకు ప్రత్యేక బాలికల పాఠశాల ఏర్పాటు విషయమై చర్చించాం. డీఈవో రాతపూర్వకంగా ఫైల్ తయారుచేసి జిల్లా కార్యాలయానికి పంపాలని సూచించారు. ప్రత్యేక బాలికల పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తాం.

- యుగంధర్‌రాజు, ప్రధానోపాధ్యాయులు, పిచ్చాటూరు

విశ్వవిద్యాలయానికి విలువైన తాళపత్రాల బహూకరణ

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయానికి హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వేద పండితులు శ్రౌతయజ్ఞ పరంపరలో ఎన్నో శ్రౌత యాగములు చేసినటువంటి అగ్నిహోత్రి బ్రహ్మశ్రీ దెందుకూరి వెంకట సత్యనారాయణశర్మ కుటుంబంలో ఎన్నో సంవత్సరాలుగా పరంపరగా వస్తున్నటువంటి యజ్ఞయాగాది క్రతువులకు సంబంధించిన, స్మార్తానికి, శాస్త్రములకు సంబంధించిన విలువైన తాళపత్ర గ్రంథాలను విశ్వవిద్యాలయ పరిపాలనా భవనం రామేశ్వరం బ్రహ్మశ్రీ ఆచార్య రాణి సదాశివమూర్తికి అందజేశారు. తాళపత్రంలలో సప్త పాకయజ్ఞ ప్రక్రియ, సోమ పంచకం, అగ్నిచయిన ప్రక్రియ, పుండరీక హౌత్రం, ఆధాన ప్రయోగ రత్నావళి మొదలైన యజ్ఞసంబంధించిన విలువైన విషయాలే కాక ఆశ్వలాయన స్మార్థం మొదలైన 24 అంశాలకు సంబంధించిన తాళపత్రాలు ఉన్నాయి. ఈ



సందర్భంగా సత్యనారాయణ శర్మ మాట్లాడుతూ ఈరోజు వేద విశ్వవిద్యాలయంలో విశ్వవిద్యాలయం ద్వారా జరుగుతున్న తాళపత్రాల డిజిటలైజేషన్ ప్రక్రియ చాలా బాగా జరుగుతుందని తెలుసుకొని 24 విలువైన తాళపత్రాలను బహుకరించానని తెలిపారు. కార్యక్రమంలో వీసీ సదాశివమూర్తి , రిజిస్ట్రార్ డాక్టర్ ఏ.వి రాధేశ్యాం పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా చూడాలని ఉమ్మడి జిల్లా పరిషత్ సీఈవో ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పుత్తూరు మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ అభివద్ధి పథకాలపై ఎంపీడీవో ఇందిరమ్మను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామకష్ణాపురం సచివాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్తు కార్యాలయ ఏవో వాణి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్ విరిత దేవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-కోట: విద్యానగర్‌లోని ఎన్.బి.కే.ఆర్.ఐ.ఎస్.టి .(ఇంజినీరింగ్‌కళాశాల)లో ఐటి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్, డేటా సైన్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బి.లక్ష్మణ్‌రావు డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఆయన్ను శుక్రవారం కళాశాలలో డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్ రెడ్డి, విభాగాధిపతి డాక్టర్ నారాయణరావు, అధ్యాపకులు అభినందించారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అధికారులు దృష్టిసారించాలి

ప్రజాశక్తి-క్యాంపస్: సుస్థిర అభివద్ధి లక్ష్యాల సూచికలపై అధికారులు అవగాహన పెంపొందించుకుని, వాటిపై దష్టి పెట్టి సకాలంలో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని, వాటి ఆధారంగానే ప్రపంచ దేశాల అభివద్ధి, నాణ్యమైన జీవన విధానం, మానవజాతి అభివద్ధి, జంతుజాల సంరక్షణకు దోహదం చేస్తుందని, అందులో మన దేశ, రాష్ట్ర ర్యాంకింగ్ ఆధారపడి ఉంటుందని ప్లానింగ్ విభాగ కార్యదర్శి విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఉదయం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో రాష్ట్ర ప్రణాళిక శాఖ ఏర్పాటు చేసిన ఎస్. డి. జి., స్పందన ఓరియంటేషన్ కార్యక్రమంలో ప్రణాళిక శాఖ కార్యదర్శి



తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ డీకే బాలాజీ, మున్సిపల్ కమిషనర్ అనుపమ అంజలి , చిత్తూరు, తిరుపతి జిల్లాల జిల్లా అధికారులు, డివిజన్ స్థాయి, మండల స్థాయి, పోలీస్ అధికారులు పాల్గొన్న కార్యక్రమాన్ని అన్ని సచివాలయాల సిబ్బంది వీక్షించే విధంగా యుట్యూబ్ లింక్ ఏర్పాటు చేసి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ప్లానింగ్ కార్యదర్శి మాట్లాడుతూ మానవ జాతి అభివద్ధి కోసమే ప్రపంచ దేశాలు సమావేశమై ఈ సుస్థిర అభివద్ధి లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ప్రపంచ దేశాలు ఒకతాటిపై యునైటెడ్ నేషన్స్ లో 2000 సంవత్సరంలో ఎనిమిది అంశాలు 15 సంవత్సరాల కాలపరిమితితో సుస్థిరమైన అభివృద్ధి సాధన ఉండాలన్నారు. జిల్లా అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే రీ సర్వే



ప్రజాశక్తి-పాలసముద్రం: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి రీ సర్వే నిర్వహించారు. తహశీల్దార్ బాబు శుక్రవారం పాలసముద్రం రెవిన్యూ పరిధిలో రీ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్షణ పథకంపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రీ సర్వేతో శాశ్వతంగా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. రీ సర్వే చేయడానికి రైతులు పాస్ బుక్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ తప్పకుండా సంబంధిత విఆర్ఒలకు అందించాలని తెలిపారు. అందువలన రైతులు, ప్రజలు రీ సర్వేకు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ కిరణ్ కుమార్, విలేజ్ సర్వేయర్ అలీబాష, వాలంటీరు సత్తివేల్, రైతులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనే లక్ష్యం



ప్రజాశక్తి-పాలసముద్రం: కుష్టి వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మోహన్ కృష్ణ తెలిపారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపర్‌వైజర్ సుశీల, మురళి సమక్షంలో ఆరోగ్య సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం డాక్టర్ మోహన్ కృష్ణ మాట్లాడుతూ కుష్టు వ్యాధిని సమాజం నుంచి తరిమి వేయడానికి క్షేత్రస్థాయి సిబ్బంది సకాలంలో రోగులను గుర్తించి వెంటనే చికిత్స అందిస్తే అంగవైకల్యం, ఇతర సమస్యలు రాకుండా నిరోధించవచ్చన్నారు. గ్రామాల్లో పర్యటించి స్పర్శ లేని మచ్చలను సర్వే చేసివ్వాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్పొరేట్ స్థాయి విద్య



ప్రజాశక్తి-కార్వేటినగరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విజయులు రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థులు ఓపన్ డే ఓరియెంటేషన్ కార్యక్రమంలో భాగంగా డిగ్రీ కళాశాలలోని మౌలిక సదుపాయలు, విద్యా వసతులపై పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, ఇతర అధ్యాపక బందం కళాశాలలోని అన్ని విభాగాల గురించి ఇంటర్ విద్యార్థులకు వివరించారు. ఫిజిక్స్, కంప్యూటర్ ల్యాబ్, స్మార్ట్ బోర్డు టీచింగ్, జెకేసీ, ఇంగ్లీషు ల్యాబ్, అధునాతన డిజిటల్ లైబ్రరీ, కళాశాల ప్లేగ్రౌండ్‌లను చూపించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నట్లు గుర్తు చేశారు. అనంతరం విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని వసతులు, విద్యా వనరులను గుర్తించి సంతప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బందం, ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారు.

సిరుల చామంతికి.. దీపాల కాంతి

నూతన పద్ధతులతో లాభాల పంట

ప్రజాశక్తి-వి.కోట: సీజన్‌తో సంబంధం లేకుండా జాతీయ, అంతర్జాతీయ చామంతి రకాలతో ఏ కాలంలోనైనా చామంతి పూల సాగును సులభంగా పండిస్తూ ఔరా అనిపించుకుంటున్నారు. పూలతోపాటు నారును తయారుచేసి ఇతర రైతులకు అందిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. మండల పరిధిలోని సుద్దులకుప్పం గ్రామానికి చెందిన చలపతి 3 ఎకరాలు, వెంకటేపల్లికి చెందిన కుమార్ రెడ్డి 2 ఎకరాలు, వి.కోటకు చెందిన ఎం.వి దేవరాజులు 0.80 సెంట్ల వ్యవసాయ పొలంలో జాతీయ అంతర్జాతీయ చామంతి రకాలను తెచ్చి అన్ని సీజన్లలోనూ చామంతి పూల సాగు చేస్తూ అధిక లాభాలు గడిస్తున్నారు.

కృత్రిమ కాంతితో సాగు: పొలం చుట్టూ కంచె వేసి చామంతి మొక్కలు నాటి విద్యుత్ తీగలకు పైన బల్బులను అమర్చి రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలతో కృత్రిమ కాంతిని అందిస్తున్నారు. దీని ద్వారా అన్ని సీజన్‌లలో చామంతి పూలు పూయించడం ద్వారా సాధారణ చామంతికి భిన్నంగా, అందంగా పూలు ఉండడంతో ధరలు ఆశాజనకంగా ఉంటున్నాయి. వీటి నారు మొక్కలకు హైదరాబాద్, రాజమహేంద్రవరం, కడియం, విజయవాడ తదితర ప్రాంతాల్లో మంచి గిరాకీ ఉంటుందని రైతులు తెలిపారు.

పూల రకాలు: సాధారణంగా పండించే చామంతి రకాలు



సెప్టెంబరు నుంచి డిసెంబర్ వరకు తెలుపు రకాలు, ఫిబ్రవరి నుంచి మే వరకు సెంటు పసుపు, తెలుపు రకాలు, మే నుంచి జులై వరకు బుల్లెట్ పూల రకాలు పండిస్తారు. వీటితోపాటు జాతీయ, అంతర్జాతీయ రకాలైన ఐశ్వర్య, బుక్కిన్, వైటు, నీలం చాక్లెట్ చామంతి రకాలు వారు సాగుచేస్తున్నారు.



అధిక లాభాలు : సాంప్రదాయ పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా చామంతి పూలకు ధరల్లో వ్యత్యాసం ఉండడంతో రైతు నష్టపోతున్నారు. దీనిని అధిగమించేందుకు నూతన పద్ధతిలో ఎకరం పొలంలో చామంతి సాగుకు సుమారు రూ.1.50 లక్షలకు పైగా ఖర్చు అవుతుంది. సాధారణ ధరలు ఉన్నా రూ.3 నుంచి 5 లక్షల వరకు ఆదాయం లభిస్తుంది.**- కుమార్ రెడ్డి, రైతు**



నష్టాల నుండి లాభాల బాటలో: చామంతి సాగులో గతంలో తీవ్రంగా నష్టపోయాం. నూతన పద్ధతుల్లో చామంతి సాగుతో మంచి లాభాలు పొందుతూ నష్టాలనుండి బయటపడ్డాం. గతంలో డిసెంబర్ నెలలో చామంతి దిగుబడి వచ్చే సీజన్ కావడంతో రైతులందరూ పెద్ద ఎత్తున సాగు చేయడంతో మార్కెట్లో ధరలు వ్యత్యాసం ఉండడం వల్ల నష్టపోయే వాళ్ళం. వేసవిలో చామంతి పూలు లభించవు. మా ప్రాంతంలో వాతావరణం వేసవిలోనూ చల్లగా ఉండటంతో కత్రిమ కాంతి పద్ధతితో మంచి ఫలితాలు లభిస్తున్నాయి. **-చలపతి రైతు.**



ప్రభుత్వం రాయితీలు అందించాలి: నూతన పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్న రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలి. రైతులకు విద్యుత్ రాయితీలు, ఉద్యాన శాఖ ద్వారా ప్రోత్సాహకాలిస్తే ఇతర రైతులు కూడా విరివిగా కత్రిమ కాంతితో చామంతి పూలు సాగు చేసేందుకు అవకాశం లభిస్తుంది. **-ఎం.వి దేవరాజులు.. రైతు**

కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్

సిఐటియు జిల్లా అధ్యక్షులు చైతన్య



ప్రజాశక్తి-వి.కోట: ఈ నెల 5వ తేదీ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023-24 బడ్జెట్ కార్మికులకు, రైతులకు వ్యతిరేకంగా, కార్పొరేట్ శక్తుల మేలుకే అనుకూలంగా ఉందని, దీన్ని వ్యతిరేకించాలని కార్మికుల సమావేశంలో సిఐటీయూ జిల్లా అధ్యక్షులు చైతన్య కోరారు. మండల కేంద్రమైన వి. కోటలో శుక్రవారం సిఐటియు మండల అధ్యక్షులు క్రిష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చైతన్య మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ రూ.45 లక్షల కోట్లలో కార్మిక సంక్షేమం గురించి పట్టించుకోకుండా కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా ఉందని ఆరోపించారు. పెరిగిన ధరలతో పోల్చినప్పుడు కేటాయింపులు పెరగలేదని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలు కట్టే ఆదాయం కేంద్రానికి పన్నుల రూపంలో కేవలం రూ.లక్ష కోట్లు మాత్రమేనని, సామాన్య ప్రజలు కట్టే పన్నులు రూ. 13 లక్షల కోట్లని, పేదల గురించి బడ్జెట్‌లో పట్టించుకోకపోవడం ధర్మర్ధమని చెప్పారు. ఆహార సబ్సిడీ లో రూ.90 వేల కోట్లు కోత పెట్టిందని, ఎరువుల సబ్సిడీ రూ.50 వేల కోట్లు బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తగ్గించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ రైతాంగానికి వ్యతిరేకంగా ఉందని దుయ్యబట్టారు. ఉపాధి హామీ పథకానికి భారీ కోతలు విధించిన మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు, రైతులు నిరసనలు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దనాసి వెంకటరామయ్య, సిఐటియు జిల్లా నాయకురాలు శ్యామల, మహిళా సంఘం ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి, గ్రామపంచాయతీ కార్మికుల జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందప్ప, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీధర్ యాదవ్ జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా పలువురు టీడీపీ నేతల సమక్షంలో శ్రీధర్ యాదవ్ కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన శుక్రవారం అన్న క్యాంటీన్‌లో 300 మందికి అన్నదానం చేశారు. అలాగే 100 మంది పేద మహిళలకు చీరలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ కో-ఆర్డినేటర్ భీమనేని చిట్టిబాబు నాయుడు, పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కష్టమ నాయుడు, నేతలు స్వామిదాస్, కిషన్ చంద్, దేవసుందరం, నియాజ్ అలి, తలారి రెడ్డెప్ప, నీరజాక్షులు రెడ్డి, ఎట్టేరి కోదండ రెడ్డి, ప్రభాకర్ నాయుడు, బాలగంగనపల్లి దేవరాజులు, రుద్రయ్య నాయుడు, లోకనాథ రెడ్డి, చెంగల్రాయ యాదవ్, మునిరాజు యాదవ్, మురళీశ్వర్ రెడ్డి, జ్యోతిరెడ్డి, జీవరత్నం, కండిగ శంకర్, శాంతకుమార్, వెంకటేష్ యాదవ్, జ్యోతి యాదవ్, సగికుమార్, బుజ్జి బాబు, గోపి, అగరం శివ పాల్గొన్నారు.

పంటల్లో వచ్చే వ్యాధులపై అవగాహన



ప్రజాశక్తి-రొంపిచెర్ల: మండలంలోని బోడిపాటి వారి పల్లి గ్రామపంచాయతీలో పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అంశంలో భాగంగా వరిలో సాధారణంగా వచ్చే కాండం తొలుచు పురుగు మరియు ఆకు ముడత పురుగు యొక్క జీవిత చరిత్రల గురించి, అవి ఏ దశలో పంటను నష్టపరుస్తాయో తెలిపారు. అనంతరం సస్యరక్షణ చర్యల ద్వారా లింగాకర్షక బుట్టలు వాటి ఉధృతి నివారణ మార్గాలు గురించి మండల వ్యవసాయ శాఖాధికారిణి జి.సుధారాణి ఆధ్వర్యంలో రైతులకు గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ వెంకటరమణ నాయక్ రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎజు. ఖాదర్ వల్లి, రైతులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు టేకుమంద విద్యార్థుల ఎంపిక



ప్రజాశక్తి-బంగారు పాళ్యం: మండలంలోని టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ సుభాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-14 విభాగంలో ఖోఖో క్రీడలో ప్రతిభ కనబరిచిన 8వ తరగతి విద్యార్థులు హస్మిత్, నిఖిత్, 7వ తరగతి వినయ్ కుమార్ లు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 17వ తేదీన విశాఖపట్నం జిల్లా, భీమిలి పట్టణంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటారని అన్నారు. ఈ పోటీలకు ఎంపికైన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుని సర్పంచ్ రత్నయ్య, రాష్ట్ర-కురబ కార్పొరేషన్ డైరెక్టర్ అమర్‌నాథ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ప్రాంతాల విశిష్టత తెలుసుకోవాలి



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ప్రాంతాల విశిష్టత గురించి తెలుసుకోవాలని స్కౌట్, గైడ్ మాస్టర్ సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం మండలంలోని తుంభకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కౌట్స్ విద్యార్థులు మొగిలి పార్వతమ్మ కొండను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కౌట్ క్యాంపులో భాగంగా విద్యార్థి దశ నుండే ప్రాంతాల విశిష్టత, సమాజంలో సహాయపడే లక్షణాలు అలవరచుకోవాలని తెలిపారు. స్కౌట్స్ విద్యార్థులు మార్గ నిర్దేశాలు నిర్దేశించుకుని క్రమ శిక్షణను అలవరుచుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పుత్తూరు డిపో నుంచి 59 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ప్రశాంతి శుక్రవారం తెలిపారు. భక్తుల సౌకర్యార్థం 18 నుంచి 19వ తేదీ వరకు పుత్తూరు డిపో నుంచి సదాశివకోన, కైలాసకోన, మూలకోన వెళ్లేందుకు బస్సులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సదాశివ కోనకు రూ.40, కైలాస కోనకు రూ.30, మూలకోనకు రూ.20 ఛార్జీలు నిర్ణయించినట్లు తెలిపారు.

ప్రేమ జంటకు వివాహం




ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఓ ప్రేమ జంటకు వివాహం జరిపించారు. చిల్లకూరు మండలం నెలబల్లి రెట్టపల్లిలో ఉంటున్నమ కలివేటి సాయికుమార్ ఓ ప్రయివేటు కంపెనీలో చిన్నపాటి ఉద్యోగం చేసుకుంటున్నాడు. ఇతని తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోయారు. నెల్లూరుకు చెందిన ఏంజెల్ అనే అమ్మాయితో సాయి కుమార్ కు పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారింది. ఇద్దరూ ఒక్కటవుదామనుకున్నారు. సాయి కుమార్ తన స్నేహితుల సూచన మేరకు సీపీఐ, ఏఐటీయూసీ నాయకులను సంప్రదించారు. సీపీఐ నాయకులు ఇరు కుటుంబాల పెద్దలను పిలిపించారు. వారితో వేర్వేరుగా చర్చించి పెళ్లికి ఒప్పించారు. దీంతో గూడూరు సీపీఐ కార్యాలయంలో ఇరు కుటుంబాల బంధువులు, స్నేహితులు, సీపీఐ నాయకుల నడుమ గురువారం రాత్రి వారిద్దరికి వివాహం చేయించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్. ప్రభాకర్, గూడూరు నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, ఏఐటీయూసీ నాయకులు ఎంబేటి చంద్రయ్య, నగేష్, బాలాజీ, ఇరుకుటుంబాల సభ్యులు పార్వతి, మస్తానమ్మ, ఎల్లసిరి తిరుపతి, కుంచం మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రామానాయుడు ట్రస్టుచే 'గోరుముద్ద'



ప్రజాశక్తి-చిల్లకూరు: చిల్లకూరు మండల పరిధిలోని తిక్కవరం ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం రాజనేని రామానాయుడు ట్రస్టు ఆధ్వర్యంలో గోరుముద్ద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్టు ఫౌండర్ శ్రీనివాసులునాయుడు సతీమణి శిరీష మాట్లాడారు. విద్యార్థులు ఆరోగ్యకరంగా.. మానసికంగా అభివద్ధి చెంది పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. పదికి పది శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు తమ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.లక్ష విరాళం అందిస్తామని సభలో హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రయ్య, రమణయ్య, వెంకటేశ్వర్లు, చెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన టీడీపీ నాయకులు



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్రలో భాగంగా కేవీబీపురం మండలం రాజులకండ్రిగ వద్ద బహిరంగ సభలో బుచ్చినాయుడుకండ్రిగ మండలానికి చెందిన సీనియర్ నాయకులు మధునాయుడు, మేదర సంఘ నాయకులు సుందరయ్య నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.

సామాన్య భక్తులకే మొదటి ప్రాధాన్యత



ప్రజాశక్తి-నాగలాపురం: మహాశివరాత్రి దర్శనాల్లో సామాన్య భక్తులకే మొదట ప్రాధాన్యత కల్పిస్తామని నాగలాపురం మండలం సురుటుపల్లి ఆలయ ఛైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం సురుటుపల్లి ఆలయ కార్యనిర్వహణ అధికారి కార్యాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆయన జిల్లా దేవాదాయ శాఖ అధికారి రామకష్ణారెడ్డితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. మహాశివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లలో మార్పులు చేయడం జరిగిందన్నారు. క్యూలైన్లో స్వామివారిని దర్శించుకునే భక్తులకు అవసరమైన తాగునీరు, పానీయాలను అందించనున్నట్లు తలిపారు. మొదట మరగదాంబిక శ్రీ వాల్మీకేశ్వర స్వామి దర్శనం అనంతరం భక్తులు మూలవిరాట్ శ్రీ పల్లికొండేశ్వర స్వామిని దర్శించుకుంటారన్నారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలను అందించడానికి తగిన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. దీంతోపాటు భద్రతాపరంగా పోలీసులు ఉంటారన్నారు. సాంస్కతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా రూ.500 టికెట్ తీసుకున్న భక్తులకు నందీశ్వరస్వామి సేవలో పాల్గొనడానికి అన్ని వసతులు కల్పించినట్లు వివరించారు. దేవదాయ శాఖ మహాశివరాత్రి ఉత్సవాల అధికారి రామకష్ణారెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి పురస్కరించుకొని ఆలయంలో పారిశుద్ధ్యానికి పెద్దపీట వేశామన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో ఆలయ కార్యనిర్వణాధికారి కోటిరామచంద్రారెడ్డి, ధర్మకర్తల మండల సభ్యులు సురేష్, మునివేలు, చిత్ర రఘు, మంజుల ఉమాపతి, ఆలయ ప్రత్యేక ఆహ్వానితులు బాల్‌రెడ్డి రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సురుటుపల్లి ఆలయంలో అలంకరణ పనులు



ప్రజాశక్తి-సత్యవేడు: నాగలాపురం మండలం సురుటుపల్లి శ్రీపల్లికొండేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పూల అలంకరణ పనులు జోరుగా చేపడుతున్నారు. ఆలయంలో ఫిబ్రవరి 10 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం మహాశివరాత్రి సందర్భంగా సురుటుపల్లి ఆలయాన్ని వివిధ రకాల పూలతో అలంకరణ చేస్తున్నారు. బెంగళూరు నుంచి వివిధ రకాల పూలను ప్రత్యేకంగా అలంకరణ కోసం తెప్పించారు. శుక్రవారం ఆలయ ఛైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి ఆధ్వర్యంలో పూల అలంకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఆలయ ప్రాంగణంలో దాదాపు 50 మంది మహిళలు బెంగళూరు నుంచి తెప్పించిన వివిధ రకాల పూలను మాలలుగా కట్టి 100 రకాల ఆకులతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించడానికి పనులు సాగుతున్నాయి. పూల అలంకరణ కోసం తిరుపతికి చెందిన దాత మునికృష్ణ సాయం అందించారు.

శంభో..శివ శంభో..!



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దక్షిణ కైలాసంగా పేరుగాంచిన శ్రీకాళహస్తి క్షేత్రంలోని శ్రీకాళహస్తీశ్వర ఆలయం మహాశివరాత్రి ఉత్సవంకు ముస్తాబైంది. ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. శైవ క్షేత్రాల్లో తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి క్షేత్రం ఇల కైలాసంగా ఖ్యాతి గాంచింది. సష్టిలోని భూమి, ఆకాశం, నీరు, వాయువు, అగ్ని అనే శక్తులను పరమేశ్వరుడు తనలో నిక్షేపించుకుని లింగాకారంలో ఇక్కడ ఆవిర్భవించాడు. కంచిపీఠం మట్టిలింగంగా, చిదంబర క్షేత్రంలో ఆకాశలింగంగా, జంబుకేశ్వరంలో జల లింగంగా, అరుణాచలంలో అగ్నిలింగంగా, శ్రీకాళహస్తిలో వాయులింగంగా ఆవిర్భవించాడు. ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా శ్రీకాళహస్తీశ్వరుని గర్భాలయంలో రెండు దీపాలు లింగం ఉచ్ఛ్వాస, నిశ్వాసలతో వచ్చే గాలితో కదులుతూ ఉంటాయి. ఈ ఆలయంలోని లింగం స్వయంభులింగం. శ్రీకాళహస్తీశ్వర ఆలయం 12వ శతాబ్దంలో చోళరాజులు నిర్మించినట్లుగా చారిత్రక ఆధారాలు ఉన్నాయి. రాజేంద్రచోళుని పాలన 13వ శతాబ్దంలో ముగిసిన తరువాత విజయనగర రాజులైన సాలువ రాజు, శ్రీకృష్ణ దేవరాయలు, శ్రీకాళహస్తి జమీందారుల హయాంలో ఈ ఆలయం అనేక రకాలుగా అభివద్ధి చెందిందని చెబుతారు. శ్రీకాళహస్తి క్షేత్రాన్ని దక్షిణ కైలాసమని, భాస్కర క్షేత్రమని, అఖండ బిల్వవనమని, సద్యోముక్తి క్షేత్రమని, శివానందైక నిలయమని పురాణాల్లో చెప్పబడింది. ఇక్కడ శివలింగాన్ని పూజించి సాలె పురుగు, పాము, ఏనుగు, మోక్షం పొందాయి. అందుకే ఈ క్షేత్రానికి శ్రీ(సాలె పురుగు)- కాళ(పాము)- హస్తి(ఏనుగు) అనే పేరు వచ్చింది. ఇక తిన్నడనే భక్తుడు శివునికి తన కన్ను ఇచ్చి భక్తకన్నప్పగా పేరు గాంచాడు. అందుకే శ్రీకాళహస్తి క్షేత్రంలో భక్తకన్నప్పకే తొలిపూజ చేస్తారు. ఆ తరువాతనే శ్రీకాళహస్తీశ్వరునికి పూజలు చేస్తారు. ఈ ఆలయంలో జగన్మాత అయిన పార్వతీదేవి జ్ఞాన ప్రసూనాంబగా వెలిశారు. జ్ఞాన ప్రసూనాంబ దేవి తాను సంపాదించిన జ్ఞానం మొత్తం సర్వ జీవరాసులకు పంచి పెడుతుందని ప్రతీతి. అమ్మవారిని దర్శించుకుంటే జ్ఞానం సిద్ధిస్తుందనే నమ్మకం భక్తుల్లో ఉంది.

నంది వాహనంపై భక్తవత్సలుడు

బంగారుపాళ్యం: మండలంలోని స్వయంభుగా వెలసి ఉండు శ్రీ కామాక్షి సమేత మొగిలేశ్వర స్వామి కి మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం అధికార నంది వాహనంపై భక్తులకు శివపార్వతులు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా బంగారుపాళ్యం మండలం గాండ్లపల్లి వాస్తవ్యులు సాంబశివ, నాయన వారు కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు పంచాయతీ, డీఆర్ఎన్ కండ్రిగ సమీపంలో అరుణగిరి క్షేత్రం ఉంది. ఇక్కడ ప్రతి సంవత్సరం ఆనవాయితీగా మహాశివరాత్రి ఉత్సవాలు జరుగుతాయి. ఈ వేడుకకు డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, కుమార్తె కృపాలక్ష్మిని ఆలయ కార్యనిర్వాహకులు, వైసీపీ శ్రేణులు శుక్రవారం ఆహ్వానించారు.

కార్వేటినగరం: మండలంలోని సుద్దగుంట సమీపంలో వెలిసిన శిష్టసౌందర్యవల్లి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నారు. ఆలయ ఆవరణం చుట్టూ చలువ పందిళ్లు, భక్తుల సౌకర్యార్థం తాగు నీటి ట్యాంకులు ఏర్పాటు చేస్తున్నారు. అదే విధంగా ఆలయ గోపురాలను విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు.

గంగాధరనెల్లూరు: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని మహదేవ మంగళం, సిద్ధేశ్వర కొండ, వేల్కూరు, కొట్రకోన, వెజ్జుపల్లి, గంగాధర నెల్లూరు గ్రామాల్లో గల శివాలయాల్లో ముందస్తుగా నిర్వాహకులు విద్యుత్ బల్బుల అలంకరణ, పూలమాలలతో ప్రత్యేక అలంకరణలు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటా..!



ప్రజాశక్తి-బాలాయపల్లి: 'మీలో ఒక్కడిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తా' అని వెంకటగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని బైరవరం గ్రామంలో 'ఇదేమి ఖర్మ.. మన రాష్ట్రానికి' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ఆంధ్రప్రదేశ్‌లో పేద ప్రజలు మూడుపూట్ల కూరతో భోజనం చేసే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని వాపోయారు. టీడీపీ నాయకులు కొరపాటి రామచంద్రనాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి, సత్యంనాయుడు, మండల శాఖ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ 'ఇదేం ఖర్మ..మన రాష్ట్రానికి'



ప్రజాశక్తి-కోట: శ్రీ లక్ష్మమ్మ గిరిజనకాలనీలో శుక్రవారం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న వ్యతిరేక విధానాలను వివరించారు. ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు సర్వోత్తమ రెడ్డి, సురేష్ బాబు, అనిల్, పాదర్తి రాధాకృష్ణారెడ్డి, షేక్.మస్తాన్ బాషా, బాలకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



ప్రజాశక్తి-తిరుమల: నారా లోకేష్ పాదయాత్రకు అడ్డంకులు సష్టిస్తున్న వారిని ఆ దేవుడే చూసుకుంటారని టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పాదయాత్రలకు అడ్డంకులు సష్టించడం దేశంలో ఇదే తొలిసారి అన్నారు. దేశంలో ఎంతో మంది నాయకులు పాదయాత్రలు చేసినా ఇలాంటి పరిస్థితి రాలేదని.. ప్రతిపక్షాన్ని చూసి భయపడి పోలీసులతో పాదయాత్రకు అడ్డంకులు సష్టించడం ఇదే తొలిసారని వాపోయారు. పేదరికంలో ఉన్న గిరిజన కుటుంబాలను కాపాడాలని శ్రీవారిని వేడుకున్నానని, టీడీపీ అధికారంలోకి వస్తే యానాది కార్పోరేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఎస్వీసీఈలో విద్యార్థులకు అవగాహన



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఆగ్ మెంటెడ్ ఎనలిటిక్స్‌పై సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ బి. విజయబాబు మాట్లాడుతూ ఎనలటిక్స్‌తో కలిగే అవసరాలను, ప్రత్యేకతలను విద్యార్థులకు వివరించారు. ప్రొఫెసర్ విజయబాబును ఎస్వీసీఈ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి జ్ఞాపికతో సత్కరించారు.

అర్ధగిరి ఆంజనేయస్వామి సేవలో ఎస్పీ దంపతులు



ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఐరాల మండలంలోని అర్ధగిరి ఆంజనేయ స్వామి ఆలయాన్ని జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలను ఆలయ ఈఓ సుబ్బారెడ్డి అందజేశారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మహతి ఫౌండేషన్ బైరెడ్డిపల్లి వారి సహకారంతో పిఇఎస్ హాస్పిటల్ కుప్పం వారి ఆధ్వర్యంలో ఈనెల19వ తేదీ ప్రఖ్యాత కంటి వైద్య నిపుణులచే ప్రారంభించబడుతుందన్నారు. ఈ హాస్పిటల్‌లో ఉచితంగా కంటి శస్త్ర చికిత్స నిర్వహణ, అవసరమైన వారికి ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు మహతి ఫౌండేషన్ బైరెడ్డిపల్లి వారు మండల ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరుతున్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



ప్రజాశక్తి-క్యాంపస్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 66వ అంతర్ జిల్లాల పోటీలు అండర్-14 గర్ల్స్ విభాగంలో డీఎస్సీ స్టేడియం నర్సరావుపేటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో ఎస్వీయూ క్యాంపస్ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. చిత్తూరు జిల్లా టీం నుంచి తొమ్మిదో తరగతి జాహ్నవి, ఏడో తరగతి కుమారి పాల్గొన్నారు. రాష్ట్రస్థాయిలో చిత్తూరు జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షకీనమ్మ విద్యార్థులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు చదువుతోపాటు ఆట పోటీల్లో రాణిస్తున్నారని.. ఆటలతో శారీరక దఢత్వాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు సన్నీ ప్రభాకర్, శరవణ పాల్గొన్నారు.

నిమ్మ రైతులకు కత్తెర్ల పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు రూరల్: ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మేగనూరు గ్రామ బీసీకాలనీలో నిమ్మ రైతులకు ప్రకతి వ్యవసాయంలో శిక్షణ ఇచ్చి సాగులో మెలకువలు, ఆధునిక పద్ధతిలో శిక్షణ నిర్వహించారు. రైతులకుర నిమ్మ పంటలో ఎండు కొమ్మలు కత్తిరించుకోవడానికి కత్తెర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్ల విజయమ్మ, ఐసీఐసీఐ ఫౌండేషన్ అభివద్ధి అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తున్నాం.. న్యాయం చేస్తాం..!



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నగరి నియోజకవర్గంలో జరిగిన లోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతం చేసిన పుత్తూరు పట్టణ, రూరల్ మండల టీడీపీ కుటుంబ సభ్యులందరికీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గాలి భాను ప్రకాష్ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం, చంద్రబాబు సీఎం కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, బీసీసెల్ అధ్యక్షులు షణ్ముగంరెడ్డి, ధనపాల్, మాధవనాయుడు, రవికుమార్, బాలాజీ, వేలు, మహమ్మద్ రఫీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా కల్తీనూనెల విక్రయాలు

నిద్రావస్థలో కల్తీ నిరోధకశాఖ



ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఆహారపదార్థాలు, తినుబండారాల తయారీలో వంటనూనెల ప్రాధాన్యత అధికంగా ఉంటుంది. కల్తీ లేని నూనెల వాడకంతో ఆరోగ్య సమస్యలు తలెత్తవు. సీల్డ్ చేసిన ప్యాకెట్స్, డబ్బాల్లో నూనెలనే విక్రయించాలని నిబంధనలున్నా లాభార్జన కోసం బహిరంగ మార్కెట్‌లో విడి నూనెల విక్రయాలు యదేచ్ఛగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. విడిగా విక్రయించే నూనెల్లో ఇతర నూనెలు కల్తీ చేయడం వల్ల కల్తీ నూనెలతో తయారు చేసిన ఆహార పదార్థాలు, తినుబండారాలు ప్రజా అరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇటీవల 15 రోజుల క్రితం చిత్తూరు నగర కమిషన్ నగరంలోని కొన్ని హోటల్స్‌లో చేపట్టిన తనిఖీల్లో కుళ్లిన మాంసం, చేపలు, రొయ్యలు రోజుల తరబడి రిఫ్రిజిరేటర్లలో నిల్వ ఉంచినట్లు గుర్తించి ఓ ప్రముఖ హోటల్‌ను సీజ్ చేయడంతో నగరంలోని హోటల్స్ పరిశుభ్రత పాటించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇదే తరహాలో నగరంలో ఆయిల్ డీలర్లు కల్తీ నూనెలు విక్రయిస్తూ ప్రజా ఆరోగ్యంతో చలగాటం ఆడుతున్నాయి. నిత్యావసర ధరల పెరుగుదలతో తక్కువ ధరకు లభించే వంట నూనెను అల్పాదాయ వర్గాలు కొనుగోలు చేస్తున్నాయి. ఇదే అదునుగా సన్‌ఫ్లవర్, పామాయిల్, వేరుశనగ నూనెలను కల్తీ చేసి ఆయిల్ డీలర్లు సొమ్ము చేసుకుంటున్నారని విమర్శలున్నాయి. కల్తీ నూనెల విక్రయాలను అదుపు చేయాల్సిన కల్తీ నిరోధక శాఖ అధికారుల మొద్దు నిద్ర ఆయిల్ డీలర్ల పాలిట వరంగా మారింది. అడపాదడపా దాడులు సోదాలు మినహా కల్తీని నిరోధించేలా కల్తీ నిరోధకశాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో చిత్తూరు, పరిసర గ్రామాల్లో కల్తీనూనెల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పండగల సందర్భంగా వంట నూనెలకు విపరీతమైన గిరాకీ ఉండటంతో ఇలాంటి సమయాల్లో కల్తీ నూనెల విక్రయాలు జోరుగా సాగుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు.

కల్తీ ఇలా...: నూనెల ధరలు పెరగడంతో పత్తిగింజలు, తవుడు తదితర నాసిరకం నూనెల్ని పామాయిల్‌తో కలిపి ఫాస్ట్‌పుడ్ సెంటర్లు, రోడ్లపై ఉన్న తినుబండారాల దుకాణాలు, చిన్న చిన్న హోటల్స్‌కు సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. కంపెనీ నూనెల ధరల కంటే ఇలా విక్రయించే నూనె ధరలు తక్కువగా ఉండటంతో తినుబండారాల తయారీదారులు వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఆహార భద్రతా నియంత్రణ శాఖ నిబంధనల ప్రకారం ఒక్కసారి వాడిన నూనెల్ని తిరిగి వాడకూడదు. ఒక్కసారి తినుబండారాల తయారీ కోసం ఉపయోగించిన నూనెల్ని తిరిగి ఉపయోగించడం వల్ల శ్వాసకోస వ్యాధులు వచ్చే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు. రోడ్ల పక్కన విక్రయించే తినుబండారాలు, ఫాస్ట్‌పుడ్ సెంటర్లలో ఇలా నిబంధనలకు విరుద్ధంగా నూనెల్ని ఉపయోగిస్తున్నారు.

తనిఖీలు మరిచిన అధికారులు: బహిరంగ మార్కెట్‌లో కల్తీ నూనెల విక్రయాలు యదేచ్ఛగా సాగుతున్నా ఆహార భద్రతా నియంత్రణ శాఖ తనిఖీలు నామమాత్రంగా ఉంటున్నాయి. సిబ్బంది కొరత సాకుతో తనిఖీ చేయడం మానేశారు. రెండు నెలల క్రితం నగరంలోని దర్గా సర్కిల్‌లో ఓ నాన్‌వెజ్ హోటల్ బిర్యాని తిని ఓ కుటుంబం పుడ్‌పాయిజన్‌తో ఆసుపత్రి పాలైంది. బాధితుడి ఫిర్యాదుతో ఆహార భద్రతా అధికారులు బిర్యాని శ్యాంపుల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు. కల్తీ జరిగిందా లేదా అనే విషయం రెండు నెలలు అవుతున్నా స్పష్టత లేదు. కల్తీ నూనెలు, ఆహార పదార్థాలపై సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ ప్రజా ఆరోగ్యం కాపాడాలని నగర ప్రజలు కోరుతున్నారు.

చంద్రబాబు పర్యటన అడ్డుకోవడం అమానుషం



ప్రజాశక్తి-రామకుప్పం: తూర్పుగోదావరి జిల్లాలో టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటనను పోలీసులు అడ్డుకోవడం అమానుషమని మండల టీడీపీ నేతలు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మండల టీడీపీ కార్యాలయంలో పత్రికా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య బద్ధంగా పాలకుల విధానాలను ప్రజలకు తెలియజెప్పి చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్న ప్రతిపక్ష నేతను ఎక్కడికక్కడ అడ్డుకోవాలని పాలకులు ప్రయత్నించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. రాష్ట్రంలో రాజ్యాంగాన్ని ఉల్లంఘించడం వైసీపీకి అలవాటుగా మారిందని, గతంలో టీడీపీ రాజశేఖర్ రెడ్డి, జగన్, షర్మిల, పాదయాత్రలకు ఎటువంటి అడ్డంకులు కలగకుండా తగు భద్రత కల్పించారని వైసీపీ నేతలు, పోలీసులు గుర్తు చేసుకోవాలన్నారు. ఇప్పటికైనా వైసీపీ నిరంకుశ ధోరణి పక్కన పెట్టి ప్రతిపక్ష నేతల పర్యటనలను అడ్డుకోవడం మానుకోవాలని హితవు పలికారు. రాజకీయాలు రాజకీయంతోనే ఎదుర్కోవాలి తప్ప ఇటువంటి అడ్డంకులతో చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. రానున్న రోజుల్లో ప్రజలే వైసీపీ నేతలకు తగిన బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహులు, మాజీ మండలాధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి, నేతలు రామ్మూర్తి, రామకష్ణప్ప, కామరాజ్ నాయక్, మనోహర్, జయశంకర్, మహమ్మద్ రఫీ, వెంకటరమణ, సత్తి, పెరుమాళ్, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

అమరరాజా విద్యాలయంలో వార్షికోత్సవ వేడుకలు



ప్రజాశక్తి-రేణిగుంట: కరకంబాడి పంచాయతీలోని అమరరాజా విద్యాలయంలో శుక్రవారం 27వ వార్షిక దినోత్సవ వేడుకలు జరిగాయి. రిటైర్డ్ యస్.వి.యూనివర్శిటీ ప్రొఫెసర్ డీన్ కిరణ్ క్రాంతి హాజరయ్యారు. ఈ సందర్భంగా అమర రాజా సంస్థల అధినేత గల్లా రామచంద్రనాయుడు మాట్లాడుతూ తమ ఉద్యోగుల పిల్లలందరికీ నాణ్యమైన విద్యను అందించి అభివద్ధికి కృషి చేస్తున్నామని.. అన్ని సదుపాయాలను కల్పించామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ గౌరీనేని రమాదేవి , డి.జి.యమ్ అమరరాజా బ్యాటరీస్ లిమిటెడ్ సతీష్, ప్రధానోపాధ్యాయురాలు గ్లోరి దేవప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్వీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని ప్రతిభ



ప్రజాశక్తి-క్యాంపస్: 38వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూడో చాంపియన్షిప్ టోర్నమెంట్ 2023, కాకినాడ డీఎస్సీ ఇండోర్ స్టేడియంలో ఈనెల 12వ తేదీ నిర్వహించిన టైక్వాండో టోర్నమెంట్ లో ఎస్వి ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని ప్రతిభ చాటారు. ఎస్వి ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని లీలా మానస, ఫస్ట్ బి ఎ, హెచ్ ఈ పి, ఇంగ్లీష్ మీడియం విద్యార్థి 73 కేజీల వెయిట్ కేటగిరీలో పాల్గొని సిల్వర్ మెడల్ గెలిచింది. ఈ సందర్భంగా ఎస్వి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయణమ్మ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. ముస్తాక్ అహ్మద్, డాక్టర్ ఎన్. భీమన్న అభినందించారు.

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సేవా కార్యక్రమాలు అభినందనీయం

న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కరుణకుమార్



ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: దళితవాడల్లో మౌళిక వసతుల కల్పనకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ముందుకు రావడం అభినందనీయమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఇరువారం దళితవాడలో కార్పొరేషన్ అశోక్ నేతృత్వంలో ఉచిత న్యాయసేవలపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న న్యాయమూర్తి కరుణకుమార్ మాట్లాడుతూ రాజకీయ నేతల్లో 20వ డివిజన్ కార్పొరేటర్‌కు ఓ ప్రత్యేక స్థానమన్నారు. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ద్వారా రూ.కోటి తో సోలార్ వీధి దీపాలు, డ్రైనేజీల నిర్మాణాలకు కృషి చేయడం అభినందనీయమన్నారు. అలాగే చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఇరువారం దళితవాడ మౌళిక వసతులతో ఇతర ప్రాంతాలకు ఏమాత్రం తీసిపోని విధంగా అభివృద్ధి సాధించాలని ఇందు కోసం కార్పొరేటర్ అశోక్ సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఎస్‌పి అయిషాబేగం, వివిధశాఖల అధికారులు, దళితవాడ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఐసిడిఎస్, అటవీశాఖ, ఆరోగ్యశాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను న్యాయమూర్తి పరిశీలించారు.

రాస్ టాటా ట్రస్టుచే ఉచిత వైద్యసేవలు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాష్ట్రీయ సేవా సమితి(రాస్) మహిళా పొదుపు సంఘ సభ్యుల సౌకర్యార్థం శుక్రవారం పుత్తూరు కావమ్మ ఆలయం ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని టాటా ట్రస్ట్ హాస్పిటల్ తిరుపతి వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆరోగ్య సమస్యలకు ఉచిత వైద్య పరీక్షలు చేపట్టారు. క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ హరి, టాటా ట్రస్ట్ కోఆర్డినేటర్ హేమంత్, వార్డ్ కౌన్సిలర్ చిన్న, రాస్ అధికారి రవి, అన్బలగన్, కమల, బాబు, పాల్గొన్నారు.

నిరంతర కృషితోనే ఉత్తమ ఫలితాలు



ప్రజాశక్తి-రేణిగుంట: కరకంబాడీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు సులభంగా ఉత్తీర్ణులు కావడానికి శుక్రవారం అవగాహన తరగతులు నిర్వహించారు. కార్వేటినగరం డైట్ లెక్చరర్ వై శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టంగా ఉన్న సబ్జెక్టులను పదేపదే ప్రాక్టీస్ చేయాలని.. ఉదయాన్నే లేచి శ్రద్ధగా చదవాలని సూచించారు. కష్టంగా ఉన్న సబ్జెక్టు ఉపాధ్యాయుల సహకారంతో సందేహాలను నివత్తి చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీగల ఆనంద్, ఉపాధ్యాయులు అమరేంద్ర భూపతిరెడ్డి, దండు రామచంద్రయ్య, రెడ్డయ్య విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు



ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలపై గళమిప్పాం : విఠపు

ప్రజాశక్తి - నాయుడుపేట పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ఎమ్మెల్సీ విఠపు. బాలసుబ్రహ్మణ్యం శుక్రవారం సాయంత్రం నాయుడుపేట యూటీఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో అధికార పార్టీ అనేక అక్రమాలకు పాల్పడిందని, ఈ అక్రమాలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. స్పందించి కొన్ని అక్రమ ఓట్లను తొలగించారని, ఇపుడు హైకోర్టు తీర్పుతో మరలా ఓటర్ల లిస్టు వెరిఫికేషన్ మొదలయ్యిందన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు ప్రైవేట్ ఉపాధ్యాయులకు వ్యతిరేకం కాదన్నారు. 2018లోనే శాసనమండలిలో ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడామని, హెల్త్‌కార్డులు, ఇన్సూరెన్స్ ఇవ్వాలని పోరాటం చేశామన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

వైసిపి ఏజెంట్‌లా ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్ సమాజం యొక్క భవిష్యత్తును నిర్ణయించే అత్యుత్తమ వ్యవస్థ విద్యావ్యవస్థని, అయితే అటువంటి వ్యవస్థకు కీలకమైన అధికారిగా ఉన్న ఎస్ సి ఈ ఆర్ టి డైరెక్టర్, ఆర్జెడిగా వ్యవహరిస్తున్న ప్రతాప్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరు విద్యావ్యవస్థ కే మాయనిమచ్చగా నిలుస్తోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్. మాధవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే తమకు అనుకూలంగా వ్యవహరించడం లేదని అనంతపురం, నెల్లూరు జిల్లా ల విద్యాశాఖ అధికారులను మార్చడమే కాకుండా ఎన్నికల్లో వైసిపి మద్దతు అభ్యర్థుల తరపున జనరల్ ఏజెంట్ గా వ్యవహరించడానికే అన్నట్లుగా ఆర్ జె డి గా ప్రతాప్ రెడ్డిని నియమించి ఎన్నికలు జరిగే జిల్లా లో విస్తృత ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రతాప్ రెడ్డి కి రాజకీయాలపై ఆసక్తి ఉంటే పదవికి రాజీనామా చేసి రావాలని డిమాండ్ చేశారు. ప్రతాప్ రెడ్డి పై విచారణ జరుపమని ఇప్పటికే ఎన్నికల కమిషన్ ఆదేశించిందని, ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికలు జరిగే జిల్లాలో ప్రతాప్ రెడ్డి పర్యటించకుండ చర్యలు తీసుకోవాలని కోరారు.

5,376 టన్నులు అమ్మేందుకు అనుమతి

బిడ్డర్లతో మంత్రి పెద్దిరెడ్డి సమావేశం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

గోడౌన్లలో మగ్గిపోతున్న ఎర్రచందనాన్ని పారదర్శకంగా వేలం వేసి విక్రయించనున్నట్లు విద్యుత్ అటవీ, భూగర్భ గనుల శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. 5,376 టన్నులు అమ్మేందుకు అనుమతి లభించిందన్నారు. తిరుపతిలో తాజ్ హోటల్లో శుక్రవారం బిడ్డర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే ఢిల్లీ, హైదరాబాద్ బిడ్డర్లతో విజయవంతంగా అటవీ శాఖ సమావేశం నిర్వహించిందన్నారు. బిడ్డర్లకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్రం నుంచి రావాల్సిన పలు అనుమతుల విషయంలో ఏపీ అధికారులు తోడ్పాటు అందిస్తారన్నారు. సిండికేట్ విధానాన్ని కాకుండా పారదర్శకమైన విధానంలో అందరూ వేలంలో పాల్గొనాలని కోరారు.

దళిత, గిరిజన సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - తిరుపతి అర్బన్

వైసిపి హయాంలో రద్దయిన దళిత గిరిజన 27 సంక్షేమ పథకాలను తక్షణం పునరుద్ధరించాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. సుదీర్ఘకాలం పాటు షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ జాతులు అనేక పోరాటాలు చేసిన ఫలితంగా రాజ్యాంగబద్ధంగా ఈ సంక్షేమ పథకాలను సాధించుకున్నామన్నారు. శుక్రవారం తిరుపతి బైరాగిపట్టెడ గంధమనేని శివ్యభవన్‌లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షులు పి.అంజయ్య అధ్యక్షతన రాయలసీమ జిల్లాల దళిత గిరిజన జేఏసీ సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన జేఏసీ ఛైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ టి.గోపాల్‌రావు, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యురాలు కమలమ్మ, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్రమాల్యాది మాట్లాడుతూ షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ జాతులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదన్నారు. సంక్షేమ పథకాలను రద్దు చేసి రాజ్యాంగాన్ని అప్రతిష్టపాలు చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కృష్ణయ్య, ఎం.రాణాప్రతాప్, ఎం.వై.కొండలు, మేళం భాగ్యరావు, వరప్రసాద్, పి.గుర్రప్ప, చందమామల కోటయ్య, కరవది సుబ్బారావు ప్రసంగించారు.



పోటీ సదస్సు పెట్టి అడ్డుకుంటారా..? : పి.అంజయ్య

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రాజ్యాంగం కల్పించిన దళిత, గిరిజన హక్కులను, పథకాలను రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందని, ఈ వాస్తవాలను ప్రజలకు తెలియజేసే ప్రక్రియలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సదస్సును నిర్వహిస్తున్నామని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణాది అధ్యక్షులు పి.అంజయ్య తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత, గిరిజన పథకాలను పున్ణ ప్రారంభించాలనే డిమాండ్లతో తిరుపతిలో సదస్సును నిర్వహించాలని ప్రయత్నిస్తే రాష్ట్ర ప్రభుత్వం తమ సదస్సుకు పోటీగా మహిళా వర్సిటీలో ఆదివాసీయుల సదస్సును ఒకే సమయానికి నిర్వహించడం దళిత, గిరిజనులను పరోక్షంగా అడ్డుకోవడమేనన్నారు. గతంలో అమలు అవుతున్న అంబేద్కర్ పథకం పేరును మార్చి వైఎస్ఆర్ పేరును పెట్టారన్నారు. దీనికి తోడు సాధ్యం కాని నిభంధనలను పొందుపర్చారన్నారు. వాస్తవాలను ప్రజలకు తెలపాలని చూస్తే పోటీ సదస్సులను నిర్వహించడం శోచనీయమన్నారు. దళిత హక్కులను, పథకాల అమలు కోసం నిరంతరం పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి వరప్రసాద్, సుబ్బారావు, భాగ్యరావు, సుబ్రమణ్యం, చిన్నం కాళయ్య, నాగభూషణం పాల్గొన్నారు.

18,19 తేదీల్లో నామినేషన్లు స్వీకరించబడవు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్

ఈనెల 18,19 శివరాత్రి పండుగ సందర్భంగా స్థానిక సంస్థలు, పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్సి స్థానాలకు అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించబడవని స్థానిక సంస్థల రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్సి ఎన్నికల రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ హరినారాయణ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే నామినేషన్ల స్వీకరణ రెండో రోజైన శుక్రవారం స్థానిక సంస్థలు, పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్సి స్థానాలకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని తెలిపారు.